
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
శనివారం 11 అక్టోబరు 2025



జిల్లా రవాణా శాఖ అధికారుల తనిఖీలు



జరిమానా విధిస్తున్న అధికారి

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం శివారు ప్రాంత ప్రధాన రహదారులలో శుక్రవారం జిల్లా రవాణా శాఖ అధికారులు వాహనాలను తనిఖీలు చేశారు. నిబంధనాలకు విరుద్ధంగా నడుపుతున్న పది వాహనాలను గుర్తించి అధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖ ఇంచార్జి అధికారి గందం వంశీధర్ మాట్లాడుతూ సరైన పత్రాలు లేని వాహనాలు, అధిక లోడ్ తీసుకెళ్తున్న వాహనాలను సీజ్ చేశామన్నారు. టాక్సీ ఫిట్నెస్, పొల్యూషన్, పర్మిట్ సర్టిఫికెట్లను వాహనాల వెంట పెట్టుకోవాలని వాహనదారులకు సూచించామన్నారు. టాక్సీ కట్టని వాహనాలకు 200శాతం ఫైన్ విధిస్తామని హెచ్చరించారు. ద్విచక్రవాహనాలు, కార్ల పరిమితి 15 సంవత్సరాలు దాటిన సొంత వాహనాలకు గ్రీన్‌టాక్సీ చెల్లించి ఐదు సంవత్సరాలకు అనుమతులను పునరుద్ధరించుకోవాలని సూచించారు. లేనిపక్షంలో సొంత వాహనాలు కారు, ద్విచక్రవాహనాలను సీజ్ చేస్తేమన్నారు. ప్రతి వాహనానికి, ట్రాక్టర్ల ట్రైలర్‌లకు ముందువెనకాల తప్పనిసరిగా రేడియం స్టిక్కర్లు ఉండాలని లేకుంటే రూ.1000 నుంచి రూ.2000 జరిమానా విధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ పృథ్వీరాజ్, కానిస్టేబుల్ ప్రశాంత్, సౌమ్య, రమ్య పాల్గొన్నారు.

పెండింగ్ ఈపీఎఫ్ సమస్యలను పరిష్కరించాలి

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల మున్సిపల్ కార్మికుల పెండింగ్ ఈపీఎస్ సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుర్రం అశోక్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అమృతలాల్ శుక్ల కార్మిక భవనంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షుడు కోడం రమణ అధ్యక్షతన సిరిసిల్ల పట్టణ మహాసభ జరిగింది. సిరిసిల్ల మున్సిపల్‌లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలపై గత మూడేళ్లలో చేసిన పోరాటాలను మహాసభలో నాయకులు సమీక్షించి భవిష్యత్తు ఉద్యమ పోరాటాల కార్యాచరణను రూపొందించుకున్నారు. అనంతరం యూనియన్ సిరిసిల్ల పట్టణనూతన కార్యవర్గంతో పాటు మహిళా సబ్ కమిటీని ఎన్నుకున్నారు. యూనియన్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు ఏర్పుల బాలయ్య, కార్యదర్శి కోడం రమణ, ఉపాధ్యక్షులు నర్మెట బాబాకిషన్, కలికోట అరుణ్, కొమ్ము యశోద, కోశాధికారి మారుపాక లక్ష్మి, సహాయ కోశాధికారి నర్మట ఉమ, సహాయ కార్యదర్శులు బత్తుల దేవరాజు, అనుముల స్వామి, బడుగు శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు సుల్తాన్ నర్సయ్యను ఎన్నుకున్నారు. సిరిసిల్ల మున్సిపల్ యూనియన్ శ్రామిక మహిళ సమన్వయ కమిటి కన్వీనర్ రెడ్డిమల్ల మమత, కోకన్వీనర్ పెరుమాండ్ల ఎల్లవ్వలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా అశోక్ మాట్లాడుతూ సిరిసిల్ల మున్సిపల్ కార్మికులకు సంబంధించిన ఎనిమిది నెలల పీఆర్‌సీ బకాయిలను యూనియన్ ఆధ్వర్యంలో పోరాటాలు చేసి సాధించుకున్నామన్నారు. కార్మికుల పెండింగ్ పీఎఫ్ సమస్యలను అధికారులు పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మూషం రమేష్, సహాయ కార్యదర్శి సూరం పద్మ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కాసారపు శంకర్, నాయకుడు జిందం కమలాకర్ పాల్గొన్నారు.

రైస్‌మిల్లుపై రైతుల ఫిర్యాదు

ముస్తాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓ రైస్‌మిల్‌పై బందనకల్ రైతులు తహసీల్దార్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. వడ్లు కొనుగోలు చేస్తామని గోడపై ప్రతులు అంటించి ప్రచారం చేశారని రైతులు పేర్కొన్నారు. దీంతో ధాన్యాన్ని నేరుగా రైస్‌మిల్‌కు తీసుకెళితే ఒక సంచికి కిలో చొప్పున తీసి వేస్తున్నారని, అలాగే గుమస్తా పేరిట రూ 100, సీసీ కటింగ్ పేరిట రూ.269 కుబ్బులలు తక్కువగా ఇస్తున్నారని, దీంతో లోడ్‌కు దాదాపు 900 నష్టం కలుగుతుందని రైతులు పేర్కొన్నారు. రైస్‌మిల్‌పై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయగా ఆర్ఐ రఘు విచారణ చేశారు. రైస్‌మిల్‌కు నోటీసులు అందించి ఇలాంటి చర్యలు పునరావృతం కావొద్దని సూచించారు.

13న కలెక్టరేట్ ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన

- ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి పుట్ట మధు



సమావేశంలో మాట్లాడుతున్న పుట్ట మధు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడిని ఖండిస్తూ ఈనెల 13న కలెక్టరేట్ ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి పుట్ట మధు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ, వీహెచ్‌పీఎస్ జిల్లా ముఖ్య నాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడిని దేశ న్యాయవ్యవస్థపై జరిగిన దాడిగా భావిస్తున్నామన్నారు. ప్రధాన న్యాయమూర్తిపై దాడికి పాల్పడిన న్యాయవాది రాకేష్ కిషోర్‌పై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల 13న జిల్లా కలెక్టరేట్ ఎదుట నల్ల బ్యాడ్జీలు, జెండాలతో నిరసన, అన్ని మండల కేంద్రాల్లో నిరసన ర్యాలీలు, 22న చలో హైదరాబాద్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ నాయకులు ఆవునూరి ప్రభాకర్, ఎలగందుల బిక్షపతి, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్, వీహెచ్‌పీఎస్ జిల్లా కన్వీనర్ శోభారాణి, కోకన్వీనర్ పురుషోత్తం, కత్తెరపాక రవీందర్, ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షుడు బడుగు లింగయ్య, సీనియర్ నాయకుడు ఆవునూరి లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

- లాంఛనంగా నాలుగు కేంద్రాలు ప్రారంభం
- దిగుబడి అంచనా 4.54 లక్షల మెట్రిక్ టన్నులు
- పౌరసరఫరాల ద్వారా 2.70 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యం
- సన్నరకం ధాన్యానికి అదనంగా క్వింటాలుకు రూ 500 బోనస్
- జిల్లావ్యాప్తంగా 231 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళిక

ధాన్యం కొనుగోళ్లు షురూ..



(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు పౌరసరఫరాల కార్పొరేషన్ ద్వారా చేపట్టేందుకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది. శుక్రవారం జిల్లాలో ముస్తాబాద్ మండలంలో పోతుగల్, గూడూరు, గూడెం, కొండాపూర్ గ్రామల్లో లాంఛనంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రాంభించారు. ప్రభుత్వం సన్నరకం వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తుండటంతో ప్రత్యేకంగా కొనుగోలు చేయనున్నారు. వానాకాలం సీజన్ ప్రారంభంలో నైరుతి నై అంటూ వర్షాలు మొఖం చాటేసినా అల్పపీడనంతో వర్షాలు రైతులకు ఆశలు పెంచింది. ఆగస్టు, సెప్టెంబరులో కుండపోత వర్షాలతో రైతులు అతలాకుతలమయ్యారు. దిగుబడిపై ప్రభావం కూడా పడింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పౌరసరఫరాల కార్పొరేషన్ అక్టోబరు మూడవ వారం నుంచి ధాన్యం మార్కెట్‌లోకి వస్తుందని అంచనా వేసి అందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో కొనుగోళ్ల దిగుబడి అంచనాపై ఖరీఫ్ ధాన్యం కొనుగోలు యాక్షన్ ప్లాన్‌ను రూపొందించింది. ప్రస్తుతం వానాకాలం సీజన్‌లో 2.35 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయగా, వరి 1.84 లక్షల ఎకరాల్లో సాగు జరిగింది.

● జిల్లాలో 1.84 లక్షల ఎకరాల్లో వరిసాగు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో వానాకాలానికి సంబంధించి 1.84లక్షల ఎకరాల్లో వరిసాగు చేయగా, 4.54లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని పౌరసరఫరాలశాఖ అధికారులు అంచనాలు వేశారు. ఇందులో స్థానికంగా ధాన్యం వినియోగించుకోవడం, మిల్లర్లు నేరుగా కొనుగోళ్ల 1.84లక్షల మెట్రిక్‌టన్నులు మినహాయించి మిగతా 2.70లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని పౌరసరఫరాల శాఖ ద్వారా కొనుగోలు చేయనున్నారు. ధాన్యం దిగుబడి కొనుగోలు కేంద్రాలకు అక్టోబరు మూడవ వారంలో వస్తుందని దానికి అనుగుణంగా కొనుగోళ్ల ప్రారంభిస్తున్నారు. ఇప్పటికే మిల్లర్లతో కలెక్టర్ హరిత సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ నగేష్ వివిధశాఖల అధికారులు, కొనుగోలుకేంద్రాల నిర్వాహకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. అక్టోబరులో 47584 మెట్రిక్ టన్నులు ధాన్యం మార్కెట్‌లోకి వస్తుందని, అందులో పౌరసరఫరాల శాఖ ద్వారా 5 వేల మెట్రిక్ టన్నుల కొనుగోలు జరుగుతుందని అంచనా వేశారు. నవంబరులో 341060 మెట్రిక్ టన్నుల్లో 1.80లక్షల మెట్రిక్ టన్నులు, డిసెంబరులో 65622 మెట్రిక్ టన్నుల్లో 80వేల మెట్రిక్ టన్నులు, 2026 జనవరిలో 5వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి క్వింటాలుకు రూ 500 బోనస్ ఇస్తున్న క్రమంలో రైతులు సన్నరకం వైపు ఆసక్తి చూపారు. జిల్లాలో 12వేల ఎకరాల్లో సన్నరకం వరి సాగు చేశారు. దీనిద్వారా వచ్చే ధాన్యం దిగుబడిలో పౌరసరఫరాల కార్పొరేషన్ 9వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు అంచనా వేశారు. ధాన్యానికి గ్రేడ్ ఏ రకం రూ.2389, కామన్ రకానికి రూ.2369 మద్దతు ధర ఉంది. గత ఖరీఫ్‌లో 2.11లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం పౌరసరఫరాల శాఖ కొనుగోలు చేసింది. కాగా, జిల్లా వ్యాప్తంగా రైతులకు కొనుగోలు కేంద్రాలు వారి గ్రామాల్లోనే అందుబాటులో ఉండే విధంగా ఏర్పాట్లు చేయనున్నారు. జిల్లాలో 260 గ్రామపంచాయతీలు ఉండగా,... - మిగతా8లో

న్యాయవాదిపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న నీరటి శ్రీనివాస్

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై బూటు విసిరి అవమానించిన న్యాయవాదిపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు నీరటి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశానికి స్వాంతంత్య్రం వచ్చి 78 సంవత్సరాలు అయినా దళితులపై కుల వివక్ష చూపుతూ దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. భారత రాజ్యాంగం ద్వారా నిర్మితమైన దేశ అత్యుత్తమ న్యాయస్థాన ప్రధాన న్యాయమూర్తికి, ఐఏఎస్ అధికారులకు కూడా రక్షణ లేదన్నారు. దేశ రాజకీయాలు, ఉద్యోగాల్లో దళితులు కుల వివక్షను ఎదుర్కొంటూనే ఉన్నారన్నారు. దళితులపై కులవివక్ష చూపిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి బాబు, ఉపాధ్యక్షుడు బాలరాజు, నియోజకవర్గం ఇన్‌చార్జి రాజ్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాలుక సత్యం, రాష్ట్ర కార్యదర్శి రొడ్డ రాంచంద్రం, పట్టణ అధ్యక్షుడు పండుగ శేఖర్ నాయకులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం పట్టణ కార్యవర్గం

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం సిరిసిల్ల పట్టణ నూతన కార్యవర్గం ఏకగ్రీవమైంది. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సంఘం జిల్లా కార్యాలయంలో ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా టీవీ లక్ష్మణ్‌రావు, ప్రధాన కార్యదర్శిగా జె మోహన్‌రావు, ఆర్థికకార్యదర్శిగా పీ దేవయ్య, అసోసియేట్ అధ్యక్షుడిగా బీ బాలమల్లయ్య, ఉపాధ్యక్షులు చెంద్రలీల, ఎస్ ఎల్లయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శులు వీ యెల్లయ్య, పీ యాదగిరి, జాయింట్ కార్యదర్శి ఎస్ విద్యాసాగర్, పబ్లిసిటీ కార్యదర్శి ఎం దరథం, జిల్లా కౌన్సిలర్ బీ మల్లారెడ్డి, కార్యవర్గ సభ్యులు హనిఫ్, వెంకటేశంను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గంతో ఎన్నికల అధికారులు ఎస్ సంపత్‌కు మార్, కే నర్సింహారెడ్డి ప్రమాణస్వీకారం చేయించారు. నూతన కార్యవర్గ సభ్యులకు జిల్లా అధ్యక్షుడు ఎం బలరాం, ప్రధాన కార్యదర్శి చౌకి సుధాకర్, సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

మారుమూల గ్రామాలకు ప్రయాణ కష్టాలు

- అధ్వానంగా రోడ్లు.. - పట్టించుకోని అధికారులు



హన్మాజీపేట నుంచి బండపల్లి వెళ్లే రోడ్డు 8

వేములవాడ రాజన్నకు భక్తుల నీరాజనాలు

- అన్నదాన సత్రానికి రూ. 1.11 లక్షల విరాళం



రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకుంటున్న భక్తులు 7

సేల్స్ ఉన్న వైన్స్‌లకే డిమాండ్

- 24 వైన్స్‌లకే దరఖాస్తులు.. మిగతా 24 వైన్స్‌కు నిల్ ● ముందుకు రాని మద్యం వ్యాపారులు
- 15 రోజుల్లో 154 దరఖాస్తులు.. ● జోరుగా ఎక్సైజ్ శాఖ ప్రచారం ● మిగిలింది వారం రోజులే..

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సేల్స్ ఎక్కువగా ఉన్న వైన్స్ షాపులకే డిమాండ్ ఉంది. అమ్మకాలు లేని వైన్స్‌లకు దరఖాస్తు చేయడానికి మద్యం వ్యాపారులు ముందుకు రావడం లేదు. దీంతో దరఖాస్తు చేసేందుకు రమ్మంటూ ఎక్సైజ్ అధికారులు ప్రచారం చేస్తున్నారు. మరో వైపు మద్యం వ్యాపారులకు ఫోన్స్ చేసి ఒత్తిడి తెస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ, ఎలారెడ్డిపేట సర్కిల్ పరిధిలో 48 వైన్స్ ఉన్నాయి. ఇందులో 9 గౌడ్స్ 5 ఎస్సీలకు రిజర్వు అయ్యాయి. ఇప్పటివరకు 24వైన్స్‌లకే మద్యం వ్యాపారులు 154 దరఖాస్తులు దాఖలు చేశారు. మిగతా వైన్స్‌లకు ఒక్క దరఖాస్తు రాలేదు. 2023-25లో జిల్లా వ్యాప్తంగా మద్యం అమ్మకాల ద్వారా 20నెలల్లో రూ.961 కోట్ల ఆదాయం సమకూరింది.



దరఖాస్తు స్వీకరిస్తున్న అధికారులు

దరఖాస్తు ఫీజు పెంపు ప్రభావం..

ఈసారి దరఖాస్తు ఫీజు లక్ష రూపాయలు అదనంగా పెంచడం వల్లే ప్రభావం చూపుతోంది. గత ఎక్సైజ్ పాలసీలో దరఖాస్తు ఫీజు రూ.2లక్షలే ఉండడంతో 2036 దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తుల ద్వారా రూ.40.72 కోట్ల ఆదాయం వచ్చింది. ఈసారి దరఖాస్తు ఫీజు రూ.3లక్షలకు పెంచేశారు. సెప్టెంబరు 26న వైన్స్‌ల టెండర్ ప్రక్రియ ప్రారంభం అయింది. ఇప్పటివరకు 15రోజులైనా కేవలం 154 దరఖాస్తులే వచ్చాయి. ఇంకా దరఖాస్తుల దాఖలుకు వారం రోజుల గడువు మిగిలి ఉంది. గతంలో వైన్స్‌లు దక్కించుకోవడానికి పోటీ విపరీతంగా ఉండేది. ప్రస్తుతం జిల్లాలో మద్యం అమ్మకాలు ఎక్కువ ఉన్న వైన్స్‌కి డిమాండ్ ఉంది. వైన్స్‌లకు మహిళలు టెండర్ వేస్తున్నారు. ఇప్పటివరకు 25 మంది మహిళలు దరఖాస్తు చేసుకున్నారు. మహిళల పేరిట వేస్తే అదృష్టం వరిస్తుందని మద్యంవ్యాపారులు ఆశలు పెట్టుకున్నారు. ప్రస్తుతం మద్యం వ్యాపారుల నుంచి స్పందన లేదు. ఇందుకు దరఖాస్తు ఫీజు పెంచడమే కారణమని చెబుతున్నారు. దరఖాస్తు ఫీజు నాట్ రీఫండబుల్ కావడంతో మద్యం వ్యాపారులు వెనుకడుగు వేస్తున్నారు.

మద్యం వ్యాపారుల రింగ్

జిల్లాలో వైన్స్ టెండర్‌లకు మద్యం వ్యాపారులు రింగ్ అవుతున్నారు. 10నుంచి 20మంది వ్యాపారులు కలిసి గ్రూపులుగా ఏర్పడుతున్నారు. ఇప్పటికే 10గ్రూపులు ఏర్పాటై వైన్స్ దక్కించుకోవడానికి దరఖాస్తు చేశారు. ఒక్కోగ్రూప్ 10 నుంచి 50 దరఖాస్తులు చేయనున్నారు. ఇంకా వారం రోజులు ఉండడంతో ధైర్యం చేసి దరఖాస్తు చేసేందుకు మద్యం వ్యాపారులు సిద్ధమవుతున్నారు.

మంచి రోజుల కోసం ఎదురుచూపు..

మంచి రోజుల కోసం మద్యం వ్యాపారులు ఎదురు చూస్తున్నారు. ఇందుకు వేద పండితులను ఆశ్రయిస్తున్నారు. మంచి రోజు ఎంపిక చేస్తున్నారు. ఆదివారం సెలవు రోజు కావడంతో 6రోజులే మిగిలి ఉంటాయి. ఇందులో మూడు రోజులు మంచి రోజులు మాత్రమే ఉన్నాయి. ఓ వైపు స్థానిక సంస్థల ఎన్నికలకు బ్రేక్ పడడంతో వైన్స్ టెండర్ల వైపు దృష్టి మరలే అవకాశం ఉంది.

పంటల మార్పిడితో అధిక దిగుబడులు

ఇల్లంతకుంట, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): రైతులు పంటమార్పిడి చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని జ్యోతిబాపూలే వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ నర్సింహారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పొత్తూరు గ్రామంలోని రైతువేదికలో శుక్రవారం రైతులకు అవగాహన సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో వస్తున్న ఆధునిక సాంకేతిక పద్ధతులను రైతులు అందిపుచ్చుకోవాలని సూచించారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల రకాలను ఎంపిక చేసుకోవాలన్నారు. రైతులు వ్యవసాయశాఖ సూచనలు పాటించడం ద్వారా పెట్టుబడి తగ్గడమే కాకుండా దిగుబడి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు మదన్‌మోహన్, రాంప్రసాద్, ఉమారాణి, రాజేంద్రప్రసాద్, హరికృష్ణ, సౌమ్య, కీర్తి, శ్రీజ, మండల వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి, ఏఈఓలు లలిత, రవళి, అర్చన, ఉత్తమ రైతులు రవీందర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, అజయ్, రాకేష్‌లతో పాటు వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

నాణ్యమైన సన్నబియ్యం అందించాలి

ఇల్లంతకుంట, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామంలోని రేషన్ దుకాణంలో నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు రాష్ట్ర ఆహారభద్రతా కమీషన్ సభ్యులు ఓరుగంటి ఆనంద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రేషన్‌దుకాణంలో నాణ్యమైన సన్నబియ్యం అందడం లేదని గ్రామస్తులు ఫిర్యాదు చేశారని తెలిపారు. కేసు నమోదు చేసి కలెక్టర్ డీజీఆర్‌వో ద్వారా విచారణ జరిపి రేషన్‌షాపులోని ముక్కిపోయిన బియ్యంను తీసుకొని నాణ్యమైన సన్నబియ్యం సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకొని 10రోజులలో కార్యాలయానికి నివేదిక పంపించాలని ఆదేశించారు.

కాంగ్రెస్ నాయకులను నిలదీయండి

- నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు



కాంగ్రెస్ బాకీ కార్డును విడుదల చేస్తున్న రవీందర్‌రావు, తోట ఆగయ్య తదితరులు

గంభీరావుపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం కాంగ్రెస్ బాకీ కార్డును పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 22 నెలలు గడిచినా ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రతి ఇంటా కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణీ చేసి, ఎన్నికల్లో ఓట్లు అడిగేందుకు వచ్చిన కాంగ్రెస్ నాయకులకు ఈ కార్డులను చూపి ఇచ్చిన వాగ్దానాలు ఏమయ్యాయని ప్రశ్నించాలన్నారు. అధికారం కోసం సాధ్యంకాని 6 గ్యారంటీల హామీలు ఇచ్చి, కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి, సెస్‌డైరెక్టర్ గౌరినేని నారాయణరావు, కొత్తపల్లి సింగిల్‌విండో చైర్మన్ భూపతి సురేందర్, పట్టణ అధ్యక్షుడు వెంకటి, నాయకులు లింగంయాదవ్, లక్ష్మన్, గంద్యాడపు రాజు, వహీద్, రాజిరెడ్డి, రాజేందర్, నాగరాజు, చారీ, బండ రమేష్, శ్రీమతి, సలీమ్, బాలరాజు ఉన్నారు.

సెంటినరీకాలనీలో యువకుడి దారుణ హత్య


చిరంజీవి(ఫైల్)

రామగిరి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సెంటినరీకాలనీ నడిబొడ్డున శుక్రవారం పట్ట పగలు యువకుడు దారుణహత్యకు గురైన ఘటన సంచలనం రేపింది. సెంటినరీకాలనీ సీటూ200 క్వార్టర్‌లో మహిళాసమైఖ్య కార్యాలయం నిర్వహిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం న్యూమారేడుపాక పోతనకాలనీకి చెందిన కోట చిరంజీవి(36) మహిళా సమైఖ్య కార్యాలయాని(ఐకేపీ)కి వచ్చాడు. కార్యాలయం సమీపంలో కాపు కాసుకొని ఉన్న నల్గురు వ్యక్తులు కార్యాలయంలో ఉన్న చిరంజీవిని బయటకు లాగి కత్తులతో పొడిచి, రాడ్లతో దాడి చేయగా అతడు అక్కడికక్కడే మృతి చెందాడు.

పోలీసుల కథనం ప్రకారం.. మృతుడు కోట చిరంజీవి పోతనకాలనీలో మీ సేవా సెంటర్ నిర్వహిస్తూ జీవిస్తున్నాడు. చిరంజీవి భార్య 2019లో మృతిచెందింది. పెంచికల్‌పేట్ గ్రామానికిచెందిన మహిళ, చిరంజీవి క్లాస్‌మెట్లు. పోతనకాలనీలో మీ సేవాకేంద్రాన్ని నిర్వహిస్తున్న నేపథ్యంలో కంప్యూటర్ నేర్చుకోవడానికి మహిళ చిరంజీవి వద్దకు వెళ్లేది. వీరి పరిచయం ప్రేమగా మారింది. అప్పటికే మహిళకు వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. పిల్లలను, భర్తను వదిలి వస్తానని, పెళ్లి చేసుకోవాలని కోరింది. వద్దు నా పరువు పోతుందని చిరంజీవి వారించేవాడు. అయినా ఆమెతీరు మార్చుకోకుండా ఈవిషయం మాట్లాడేందుకు డీఆర్డీఏ(ఐకెపి) కార్యాలయానికి రావాలని హత్యకు ప్లాన్‌వేసింది. సెంటినరీకాలనీ వెళ్లిన చిరంజీవిని ఆమెభర్త కుమార్, అన్న అనవేననరేష్, తండ్రి అనవేన మల్లయ్య, బంధువు పిడుగు చందు.. కోట చిరంజీవిపై మారణాయుధాలతో కొట్టి హతమార్చారు. మృతుడి తమ్ముడు కోటా రామ్‌చరణ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఘటన స్థలాన్ని ఏసిపి మడత రమేశ్, మంథనిసీఐ రాజు, ఎస్‌ఐ శ్రీనివాస్ సందర్శించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. పక్క ప్రణాళిక ప్రకారం హత్యకు గురైనట్లు పోలీసుల ప్రాథమిక విచారణ వెల్లడైయ్యింది. నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

జూలపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాచాపూర్ గ్రామానికి చెందిన బట్టు సురేష్ (40) శుక్రవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సురేష్‌కు పదేళ్లక్రితం వివాహమైంది. భార్యభర్తల మధ్య వివాదంతో ఏడేళ్ల క్రితం భార్యకు విడాకులు ఇచ్చిన సురేష్ తల్లిదండ్రులతో ఉంటున్నాడు. సురేష్‌కు సమీప బంధువు లక్ష్మణ్‌తో కొంత కాలంగా భూవివాదం నడుస్తోంది. ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో సురేష్‌పై కేసు నమోదైంది. దీంతో మానసికంగా కుంగిపోయి ఆందోళనకు గురైన సురేష్ జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి సత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సనత్‌కుమార్ తెలిపారు.

భర్త జైలులో.. దిగులుతో భార్య బలవన్మరణం


అన్వరీభేగం(ఫైల్)

మల్యాల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కొన్నాళ్లుగా భర్త జైలులో ఉండడంతో పాటు ఒంటరితనం, ఆర్థిక సమస్యలతో ఓ వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మల్యాల ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపినవివరాల ప్రకారం.. మండలంలోని నూకపల్లి అర్బన్ హౌజింగ్ కాలనీలో ఉండే అన్వరీభేగం(37) భర్త అబ్దుల్ రషీద్ కొన్నిరోజులుగా జైలులో ఉంటున్నాడు. దీంతో అన్వరీభేగం తరచూ దిగులు పడుతుండేది. అలాగే ఒంటరితనంతోపాటు ఆర్థికసమస్యలు వెంటాడుతుండడంతో జీవితంపై విరక్తిచెందిన ఆమె గురువారం రాత్రి ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుంది. వెంటనే ఆమె కుమారుడు అఖిల్ చికిత్స కోసం జగిత్యాలకు తరలించగా అక్కడ అదేరోజు రాత్రి మృతి చెందింది. మృతురాలి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

తంగళ్లపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల కేంద్రంలో ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొనడంతో ముగ్గురు గాయపడ్డారు. చిన్నలింగాపూర్ గ్రామానికి చెందిన మహేందర్ ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఆటో ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అలాగే ఆటో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో డ్రైవర్‌తోపాటు ప్రయాణికురాలు గాయపడింది.

ధ్వంసమవుతున్న గుట్టలు

- గుట్ట పై ఉన్న నందీశ్వరుడు, పాదాలు
- నిబంధనలకు విరుద్ధంగా గ్రానైట్ క్వారీ


కొమిర గుట్టపై ఉన్న శిథిలమైన నందీశ్వరుడు

ఓదెల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి అందాలు, నీటి ఊటలు, వందేళ్ల చరిత్ర ఉన్న కొమిర, ఓదెల గుట్టలు ధ్వంసమవుతున్నాయి. చారిత్రాత్మక శిల్పాలు, విగ్రహాలు, గుహలు, కట్టడాలు ఉన్న చోట గ్రానైట్ క్వారీలకు లీజుకు ఇవ్వవద్దనే నిబంధన ఉంది. అయినప్పటికీ ఓదెల, కొమిర గుట్టలను లీజుకు ఇస్తుండడంతో పర్యావరణంతో పాటు విగ్రహాలు, గుహలు దెబ్బతింటున్నాయి. కొమిర గుట్టపై వందేళ్ళ క్రితం నుంచి ఉంటున్న నందీశ్వరుని విగ్రహంతోపాటు రాముని పాదాలు క్వారీల వల్ల, గుర్తుతెలియని వ్యక్తుల వల్ల ధ్వంసమయ్యాయి. ఇదే గుట్టకు కింది భాగంలో ఉన్న చిన్నయ్య, పెద్దయ్య గుహ కూడా గ్రానైట్ క్వారీ వల్ల క్రమక్రమంగా ధ్వంస మవుతోంది.

చిన్నయ్య పెద్దయ్య గుట్ట..

వందేళ్ళ క్రితం నుంచే చిన్నయ్య, పెద్దయ్య గుట్టగా పేరొందిన కొమిర గుట్ట అలరారుతోంది. అలాగే నీటి ఊటలతో, గుహలతో ఓదెల గుట్టకు చారిత్రాత్మకమైన ఉదంతం ఉంది. నాడు కరువుతో తల్లడిల్లుతున్న సమ యంలో కొమిరకు చెందిన చిన్నయ్య, పెద్దయ్య ప్రజలకు నిలువ నీడను కల్పించడానికి గుట్టపై మొక్కల పెంపకాన్ని చేపట్టి, తాగునీటి కోసం గుహలు ఉపయోగించారని, ఫలాలతో గుట్ట ఆకలి దప్పికను తీర్చినట్లు చెబుతారు. గుట్టవద్ద యేటా చిన్నయ్య, పెద్దయ్య జాతర, వంటవార్పు నిర్వహిస్తారు. ప్రస్తుతం ఓదెల, కొమిర, చిన్న కొమిర గ్రామాల ప్రజలు యేటా శ్రావణ మాసం ముందు చిన్నయ్య, పెద్దయ్య గుహకు చేరుకుంటారు. ముందుగా గుట్టలపై ఉన్న నందీశ్వరుడు, రాముని పాదాలను దర్శించుకొంటారు.


చిన్నయ్య పెద్దయ్య గుహ వద్ద భక్తుల పూజలు

కనుమరుగవుతున్న గుట్టలు

నిబంధనలను తుంగలో తొక్కుతున్న సంబంధిత శాఖ అధికారుల తప్పిదాల వల్ల గుట్టలు క్రమంగా కనుమరుగవుతున్నాయి. ఇప్పటికే ఈ రెండు గుట్టలు క్వారీ పేరుతో 10శాతం మేరకు ధ్వంసమయ్యాయి. దీంతో గుట్టల్లో ఉన్న నెమళ్లు, కుందేళ్లు, పక్షులు, తదితర వన్యప్రాణులు మృత్యువాత పడ్డాయి. నిబంధనలకు విరుద్ధంగా అధికారులు గుట్టలను లీజుకు ఇవ్వడం వల్ల ప్రజల విశ్వాసాలు దెబ్బతింటున్నాయి.

ఒక గుట్టకు మాత్రమే అనుమతి ఇచ్చాం
మైనింగ్ ఏడీ శ్రీనివాస్



చారిత్రాత్మకమైన గుట్ట ప్రాంతానికి గ్రానైట్ క్వారీ 200 మీటర్ల దూరం ఉండాలి. కేవలం ఓదెల గుట్టకు పది హెక్టార్లు (25 ఎకరాలు) మాత్రమే గ్రానైట్ క్వారీకి 20 ఏండ్లు అనుమతి ఇచ్చాం. కొమిర గుట్టకు ఎలాంటి అనుమతి లేదు. ఓదెల గుట్టకున్న ఊట గుహల ధ్వంసంపై పరిశీలిస్తాం. ప్రస్తుతం క్వారీ నిలిచిపోయింది. కొమిర గుట్టపై గ్రానైట్ క్వారీ అక్రమంగా కొనసాగితే చర్యలు తీసుకుంటాం.

చారిత్రక ఆనవాళ్లు కనుమరుగు..
బోగే సదానందం సామాజిక కార్యకర్త, ఓదెల



క్వారీల కోసం ఓదెల కొమిర గుట్టలను గ్రానైట్ క్వారీకి లీజుకు ఇవ్వడంతో గుట్టపై ఉన్న చారిత్రాత్మక ఆనవాళ్ల కనుమరుగవుతున్నాయి. అధికారులు అనుమతులు రద్దుచేసి చిన్నయ్య పెద్దయ్య జాతరను నందీశ్వర విగ్రహం పాదముద్రికలను కాపాడాలి. కొందరు ప్రభుత్వానికి పన్నులు ఎగవేసి క్వారీలను నడుపుతున్నారు.

యువతిని బెదిరించి డబ్బులు డిమాండ్ చేసిన వ్యక్తి అరెస్టు

చందుర్తి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఓ యువతి వ్యక్తిగత ఫొటోలను సోషల్ మీడియాలో పెడతానని బెదిరించి డబ్బులు డిమాండ్‌చేసిన వ్యక్తిని అరెస్టుచేసి రిమాండ్ పంపినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. మండలంలోని అనంతపల్లి గ్రామానికి చెందిన చలేంద్ర వేణు అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన పోలే ప్రశాంత్ అనే యువకుడు నుంచి ఓ యువతి వ్యక్తిగత ఫొటోలను తీసుకున్నాడు. సదరు యువతికి ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక ఫేక్ ఐడీని క్రియేట్ చేసి నిందితుడు మెసేజ్‌లు చేస్తూ రూ 5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. డబ్బులు ఇవ్వకుంటే ఆమె వ్యక్తిగత ఫొటోలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తానని బెదిరించాడు. దీంతో సదరు యువతి షీ టీం పోలీసులను సంప్రదించింది. పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ద్వారా శుక్రవారం వేణును పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. యువత తమ వ్యక్తిగత ఫొటోలను ఎవరికి ఇవ్వవద్దని, సోషల్ మీడియాపై అప్రమత్తంగా ఉండాలని సీఐ పేర్కొన్నారు. సీఐ వెంట చందుర్తి ఎస్సై రమేష్ పాల్గొన్నారు.

బాల నేరస్థుడి అరెస్టు

కరీంనగర్ క్రైం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గతంలో దొంగతనాల కేసుల్లో వరంగల్ జువైనల్ హోంకు వెళ్లి వచ్చిన కరీంనగర్‌కు చెందిన బాల నేరస్థుడిని కరీంనగర్‌రూరల్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. కరీంనగర్‌రూరల్ మండలం, ఎల్ఎండీ, కరీంనగర్ వన్‌టౌన్ పరిధిలో పలు ఫంక్షన్‌హాళ్లలోని డ్రెస్సింగ్‌రూంలలో చొరబడి బంగారు ఆభరణాలు చోరీ చేశాడని కరీంనగర్‌రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఈనెల8న కూడా ఒక ఫంక్షన్‌హాల్ డ్రెస్సింగ్‌రూంలో చొరబడి 4గ్రాముల బంగారు కమ్మలను చోరీచేశాడని, ఆ బంగారాన్ని విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా అరెస్టు చేశామని సీఐ పేర్కొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో చిప్స్ షాపులో మంటలు

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బస్టాండ్‌వద్ద ఉన్న ఓచిప్స్ షాప్‌లో గురువారం రాత్రి షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. దుకాణం బంద్ చేసిన తరువాత షార్ట్‌సర్క్యూట్ జరిగి అందులో ఉన్న తినుబండారాలు, ఫర్నీచర్ అగ్నికి ఆహుతయ్యాయి. గమనించిన స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారు. ఫైర్ ఇంజన్ వచ్చేసరికి ఆస్తనష్టం జరిగినట్లుతెలుస్తోంది.

పేకాటరాయుళ్ల పట్టివేత

కోరుట్ల రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగులపేట గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురిని జిల్లా సీసీఎస్ పోలీసులు దాడిచేసి పట్టుకున్నట్లు ఎస్‌ఐ చిరంజీవి శుక్రవారం తెలిపారు. వారివద్ద రూ. 4,460 నగదు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కోరుట్ల పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు.

రెస్టారెంట్ సిబ్బందిపై దాడి..

- కేసు నమోదు

హుజూరాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని కరీంనగర్ రోడ్‌లోని ఓ రెస్టారెంట్‌లో పనిచేస్తున్న సిబ్బందిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. శుక్రవారం దీనిపై హుజూరాబాద్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదుచేశారు. గురువారం రాత్రి రెస్టారెంట్ మూసివేసే సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు భోజనానికి వచ్చారు. రెస్టారెంట్ మూసివేస్తామని తొందరగా వెళ్లాలని సిబ్బంది సూచించారు. అప్పటికే మద్యం సేవించి ఉన్న సదరువ్యక్తులు ఆగ్రహానికి గురై సిబ్బందిపై దాడిచేసి వెళ్లిపోయారు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా, వారు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా సదరువ్యక్తులు హుజూరాబాద్‌లోని పాతవాడకుచెందిన వారిగా గుర్తించారు.

పెన్షన్ ఇప్పిస్తానని.. పుస్తెలతాడు చోరీ


బాధితురాలు శంకరమ్మ

ధర్మారం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): నీకు పెన్షన్ మంజూరైంది, ఫొటో దిగితే నాలుగు వేల రూపాయల పెన్షన్ ఇప్పిస్తా అని ఓ వ్యక్తి వృద్ధురాలికి మాయమాటలు చెప్పి పుస్తెల తాడుతో పరారైన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన బుదారపు శంకరమ్మ(70) శుక్రవారం కూరగాయలు తేవడానికి వెళ్తుండగా ఆమెకు ఎదురుగా వచ్చిన ఓ గుర్తుతెలియని వ్యక్తి శంకరమ్మకు దండం పెట్టాడు. నేను మీ గ్రామ కార్యదర్శిని అని పరిచయం చేసుకొని మాటల్లో దింపాడు. నేను మీ ఇంటికి వెళ్లి వస్తున్నాను, నీకు వస్తున్న రెండు వేల పెన్షన్ నాలుగు వేలు అయ్యిందని నమ్మబలికాడు. నా వెంట వచ్చి ఫొటో దిగితే నీకు పెన్షన్ డబ్బులు ఇస్తానని చెప్పి గాయత్రి బ్యాంకు ఎదురుగా ఉన్న సందులోకి తీసుకెళ్లి అక్కడే ఉన్న ఓ బెంచ్‌పై కూర్చోబెట్టాడు. ఫొటో తీస్తున్న క్రమంలో పుస్తెల తాడు ఉంటే పెన్షన్ రాదని, ఈ ఫొటో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పంపాలని చెప్పాడు. దీంతో ఆ మహిళ మెడలో నుంచి మూడు తులాల పుస్తెల తాడు అతని చేతిలో పెట్టగా డబ్బులు తెస్తానంటూ జారుకున్నాడు. ఎంతసేపటికీ మనిషి రాకపోవడంతో తాను మోసపోయానని గ్రహించి సదరు మహిళ లబోదిబోమంది. శంకరమ్మ ఫిర్యాదుతో పోలీసులు చౌరస్తాలోని ఓ మొబైల్ షాప్‌లో సీసీ కెమెరాను పరిశీలించగా శంకరమ్మతో మాట్లాతున్న ఆవ్యక్తి దృశ్యాలు రికార్డయ్యాయి. జరిగిన సంఘటన ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

నిజాయితీ చాటుకున్న మాజీ ఎంపీపీ

చందుర్తి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు చిలుక పెంటయ్య తన నిజాయితీని చాటుకున్నారు. గతసెప్టెంబరు 14వతేదీన గుర్తుతెలియని వ్యక్తి ఫోన్‌పే ద్వారా రూ.49850 జమయ్యాయి. ఆ డబ్బులు నగదును తీసుకెళ్లి చందుర్తి ఎస్‌ఐ రమేష్‌కు శుక్రవారం పెంటయ్య అప్పగించారు. ఆయనవెంట మాజీకోఆప్షన్ సభ్యులు బత్తుల కమలాకర్ ఉన్నారు. ఈ సందర్భంగా పెంటయ్యను, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు అభినందించారు.

సర్వేను అడ్డుకున్న రైతులు

శంకరపట్నం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాపూర్ గ్రామశివారులో హైకోర్టు ఆర్డర్ మేరకు841,842 సర్వేనంబర్‌లను సర్వేచేయడానికి వచ్చిన ప్రభుత్వ సర్వేయర్‌ను శుక్రవారం రైతులు అడ్డుకున్నారు. సర్వే చేయించుకునే వ్యక్తికి రైతులమధ్యవాగ్వాదం చోటుచేసుకుంది. సదరువ్యక్తులు పోలీసులు, తహసీల్దార్‌కు సమాచారం అందించారు. వెంటనే సంఘటన స్థలానికి తహసీల్దార్ సురేఖ, పోలీసులు చేరుకొని రైతులతో మాట్లాడారు. హైకోర్టు ఆర్డర్ మేరకు సర్వేయర్ సర్వే నంబర్ కేటాయించడానికి వచ్చినట్లు తహసీల్దార్ సదరు రైతులకు వివరించారు. సాయంత్రం కావడంతో సర్వేచేయకుండా తహసీల్దార్, సర్వేయర్ అక్కడినుంచి వెళ్లిపోయారు.

ఏసీబీకి పట్టుబడిన మధురానగర్ కార్యదర్శి

- ఇందిరమ్మ ఇంటి బిల్లు మంజూరుకు లంచం డిమాండ్
- పదివేలు తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ అధికారులు

గంగాధర, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గంగాధరమండలం మధురానగర్ పంచాయతీ కార్యదర్శి అనిల్‌కుమార్ లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మధురానగర్ గ్రామపరిధిలోని పత్తికుంటపల్లికి చెందిన గంగాధర లాస్యకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ఇంటిపనులు బేస్‌మెంట్ లెవల్ పూర్తికాగానే మొదటిబిల్లు లక్ష నెలరోజులక్రితం ఆమె ఖాతాలో జమైంది. బిల్లు వచ్చినప్పటినుంచి గ్రామకార్యదర్శి అనిల్ పదివేలు ఇందిరమ్మ ఇంటిబిల్లు కోసం ఖర్చులకు ఇవ్వాలని వేధిస్తున్నాడు. రెండుమూడు మార్లు పైసల కోసం ఇంటికి సైతం వెళ్లాడు. ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటికి లంచం ఇవ్వలేనంటూ లబ్ధిదారురాలి భర్త శ్రీకాంత్ కార్యదర్శికి తెగేసి చెప్పాడు. అయినా కార్యదర్శి లంచం కోసం వేధిస్తుండటంతో శ్రీకాంత్ కరీంనగర్‌లోని ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్‌ను సంప్రదించాడు. ప్రణాళిక ప్రకారం శుక్రవారం గ్రామపంచాయతీలో కార్యదర్శి అనిల్ పదివేలను గంగాధర శ్రీకాంత్ నుంచి తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. గ్రామ రికార్డులను పరిశీలించి, సదరు అవినీతి కార్యదర్శిని ఏసీబీకోర్టులో హాజరుపరచనున్నట్లు ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్‌తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు ఎవరైనా పనుల నిమిత్తం డబ్బులు ఇవ్వాలని అడిగినట్లయితే టోల్‌ఫ్రీ నంబరు 1064కు ఫోన్ చేయాలని ప్రజలకు సూచించారు.


ఏసీబీకి పట్టుబడిన మధురానగర్ కార్యదర్శి అనిల్

జాతీయ రహదారిపై వరుస ప్రమాదాలు

- చెట్టును ఢీకొన్న కారు
- బోల్తా పడిన ప్యాసింజర్ ఆటో
- నలుగురికి తీవ్ర గాయాలు, మరో ముగ్గురికి స్వల్ప గాయాలు


చెట్టును ఢీకొన్న కారులో గాయాలతో యువకులు

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలజిల్లా మెట్‌పల్లి, కోరుట్ల మధ్యలోని జాతీయరహదారిపై గురువారం అర్ధరాత్రి గంటల వ్యవధిలో రెండు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోరుట్ల పట్టణానికి చెందిన ఏడుగురు స్నేహితులు టీఎస్05ఈజే 4214నంబర్‌గల కారులో టీతాగడానికి మండలంలోని మారుతీనగర్ శివారులోని హోటల్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో పెద్దాపూర్ ఎక్స్ రోడ్డు వద్ద ప్రమాదవశాత్తు రహదారికి పక్కన ఉన్న చెట్టును కారు ఢీకొట్టింది. అందులో ఉన్న అవేస్, ఫయాజ్, మౌలానా ఆమెర్, సమీర్‌కు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు. మరో ముగ్గురు సైఫ్, ఫుర్‌ఖాన్, కైఫ్‌లకు స్వల్ప గాయాలుకావడంతో జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. అదే విధంగా మారుతీనగర్ శివారులోని పెద్దగుండువద్ద కారు, టాటా మ్యాజిక్ ప్యాసింజర్ ఆటోలు ఢీకొనంగా అందులో ఉన్న వారికి స్వల్ప గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనస్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ప్రమాదాలకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు.

ఒకే వాహనంపై 277 పెండింగ్ చలాన్లు

- మొత్తం విలువ రూ.79,845


పెండింగ్ చలాన్లు ఉన్న వాహనం

కరీంనగర్ క్రైం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఐదు సంవత్సరాలకు పైగా 277 పెండింగ్ ట్రాఫిక్‌చలాన్లు పేరుకుపోయిన మోటార్ సైకిల్‌ను కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని సిక్కువాడీ ప్రాంతంలో సాధారణ ట్రాఫిక్ నియంత్రణ, పెట్రోలింగ్‌విధుల్లో ఉన్న ఇన్స్‌పెక్టర్ పి రమేష్, ట్రాఫిక్-2, కానిస్టేబుల్ జి శ్రీనివాస్‌రావు బృందంతనిఖీల్లో హీరో యూనికార్న్ మోటార్ సైకిల్ టిఎస్ 02ఇఎక్స్ 1395 నెంబర్ గల వాహనాన్ని పట్టుకున్నారు. 2019 సంవత్సరం జూన్ 8వ తేదీ నుంచి డిసెంబర్ 25 2024 మధ్య కరీంనగర్ పరిసర ప్రాంతాల్లో 277పెండింగ్ చలాన్లతో 79,845రూపాయల ఫైన్ ఉన్నది. వాహనం నడుపుతున్న వ్యక్తి కరీంనగర్‌లోని గోదాంగడ్డకు చెందిన అబ్దుల్ ఖయ్యూమ్(37) ఆర్ఎంపీ ప్రాక్టిషనర్‌గా గుర్తించారు. వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

- కరీంనగర్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో 264 చలాన్లు

మొత్తం 277 చలాన్లలో ఎక్కువ భాగంగా కరీంనగర్ ట్రాఫిక్ పిఎస్ పరిధిలో 264 నమోదయ్యాయి. 277 చలాన్లలో 254 హెల్మెట్ లేకుండా, ఫేస్ మాస్క్ ధరించకపోవడం 10, ట్రిపుల్ రైడింగ్ 7, సెల్‌ఫోన్ రైడింగ్ 2, డ్రైవింగ్ లైసెన్స్ తీసుకెళ్లకపోవడం 2, నంబర్ ప్లేట్ సరిగా లేకపోవడం 1, జిగ్‌జాగ్ డ్రైవింగ్ 1 నమోదయ్యాయి.

- చలాన్ల వసూలుకు చట్ట పరమైన చర్యలు

– యాదగిరిస్వామి, అసిస్టెంట్ పోలీసకమిషనర్ (ట్రాఫిక్)

వాహనంపై నమోదైన చలాన్లు రూ.79,845లు వసూలు చేయడానికి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ట్రాఫిక్‌నియమాల ఉల్లంఘనపై వాహనదారులు చూపుతున్న నిర్లక్ష్యాన్ని తీవ్రంగా పరిగణిస్తాం. వాహనం స్వాధీనం చేసుకున్నాం. వాహనయజమానులు పెండింగ్‌లో ఉన్న చలాన్‌లను వెంటనే క్లియర్ చేసుకోవాలి.

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి

తిమ్మాపూర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్ఎండీ కాలనీవద్ద రాజీవ్ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువతి మృతిచెందింది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. గంగాధర మండల కేంద్రానికి చెందిన ఇప్పలపల్లి రవళిక(23), దీకొండ వెంకటసాయి హైదారాబాద్‌లో ఐటీ ఉద్యోగం చేస్తున్నారు. శుక్రవారం ఇద్దరు కలిసి హైదారాబాద్ నుంచి గంగాధరకు వారి స్వగ్రామానికి బైక్‌పై వెళుతున్నారు. అతివేగంగా ఉన్న బైక్ అదుపుతప్పి ఎల్ఎండీ కాలనీవద్ద రవళిక రోడ్డుపై పడటంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ సంఘటన జరిగిన తీరును పరిశీలించారు. గుర్తుతెలియని వాహనం ఢీకొని పోయిందని దీంతో ప్రమాదం జరిగిందని బైక్ నడుపుతున్న వెంకటసాయి పోలీసులకు తెలిపాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.


ఘటన స్థలంలో మృతిచెందిన రవళిక

మెటాఫండ్ ప్రో యాప్ కేసులో ముగ్గురి అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల అర్బన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): క్రిప్టో, మెటాఫండ్ ప్రో యాప్ కేసులో జగిత్యాల పట్టణానికి చెందిన కస్తూరి రాకేష్, కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన సింగిరెడ్డి తిరుపతి రెడ్డి, వీరబత్తిని రాజును అరెస్ట్ చేసినట్లు ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు అధిక వడ్డీ ఆశ చూపి నిందితులు మెటాఫండ్ ప్రో అనే యాప్‌లో లక్ష రూపాయలు పెట్టుబడి పెడితే మూడు లక్షల రూపాయలు వస్తాయని ఆశచూపి గొలుసుకట్టు గొలుసు కట్టు వ్యాపారం చేశారన్నారు. కొడిమ్యాల మండలానికి చెందిన ముగ్గురి నుంచి 20 లక్షల రూపాయలు వసూలు చేశారని అన్నారు. పెట్టిన డబ్బుకు మూడు వంతులు వస్తుందని ఆశ చూపడంతో పాటు సింగపూర్, దుబాయ్ లాంటి దేశాలకు తీసుకెళ్తామని ఆశ చూపారని ఎస్పీ తెలిపారు. మెటా ఫండ్ మూసివేయడంతో బాధితుల ఫిర్యాదు మేరకు ఈ నెల 8వ తేదీన వీరబత్తిని రాజు, సింగిరెడ్డి తిరుపతి రెడ్డిలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపగా శుక్రవారం కస్తూరి రాకేష్‌ను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్పీ తెలిపారు. సమావేశంలో డిఎస్పీ రఘుచందర్, మల్యాల సీఐ నీలం రవి తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి చెట్టును ఢీకొన్న కారు

- చెలరేగిన మంటలు..
- దగ్ధమైన కారు..

చిగురుమామిడి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపూర్ శివారులో ఉన్న పెసరుపల్లిలో శుక్రవారం రాత్రి ఓకారు ప్రమాదవశాత్తు చెట్టును ఢీకొట్టి కాలిపోయింది. ఏఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరు జనగాం నుంచి ప్రశాంత్, సతీష్, నవీన్ అనేముగ్గురు యువకులు కొండగట్టు దైవదర్శనానికి కారులో బయలుదేరారు. ఈక్రమంలో పెసరుపల్లి శివారులో ఉన్న మూలమలుపు వద్ద కారు అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టింది. వెంటనే కారులో బెలూన్స్ తెరుచుకోవడంతో యువకులు బయటపడ్డారు. అనంతరం కారులో మంటలుచేలరేగి పూర్తిగా దగ్ధమైంది. కారు బెలూన్స్ ఓపెన్‌కాకపోతే ప్రాణనష్టం జరిగేదని, ఇతర ప్రయాణికులకు సైతం ఇబ్బంది ఉండేదని స్థానికులు తెలిపారు. ఈమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తెలిపారు.



బూజుపట్టిన లడ్డూ ప్రసాదాన్ని చూపుతున్న నేతలు

రాజన్న లడ్డూల తయారీలో నాణ్యత లోపం..

● లడ్డూల కౌంటర్‌ను పరిశీలించిన బీజేపీ నేతలు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో తయారు చేసే లడ్డూ ప్రసాదంలో నాణ్యత లోపించిందని బీజేపీ వేములవాడ పట్టణ నేతలు ఆరోపించారు. రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రసాదం కౌంటర్‌కు వెళ్లిన బీజేపీ నేతలు శ్రీధర్, శేఖర్, శ్రీనివాస్‌తో పాటు కార్యకర్తలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజన్న లడ్డూ ప్రసాదంలో నాణ్యత లోపించిందని భక్తులు నుంచి వచ్చిన ఫిర్యాదుతో రాజన్న ఆలయ ప్రసాదాల కౌంటర్‌కు వెళ్లి పరిశీలించామని, లడ్డూలు బూజు పట్టి దుర్వాసన వస్తున్నాయని గుర్తించినట్లు తెలిపారు. అంతే కాకుండా రాజన్న ఆలయానికి వచ్చిన పలువురు భక్తులు సైతం లడ్డూ ప్రసాదం దుర్వాసన వచ్చిందని చెప్పిన వీడియోలు వైరల్‌గా మారాయి. ఈ విషయంపై ఏఈవో స్పందిస్తూ రాజన్న ఆలయ విస్తరణ అభివృద్ధిలో భాగంగా తయారీ కేంద్రం కూల్చివేశామని, అందులో భాగంగానే భక్తులకు లడ్డూలు తక్కువగా ఇవ్వకుండా ఉండేందుకు ఎక్కువగా తయారీ చేస్తున్నామని, రెండు రోజులుగా వర్షం కారణంగా లడ్డూ తేమ ఆరకపోవడంతో దుర్వాసన వచ్చి ఉండవచ్చని వివరణ ఇచ్చారు.

కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారు..

ఆలయ ఈవో రమాదేవి

రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు నాణ్యమైన లడ్డూలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నా మని, కావాలని కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నా రని ఈవో రమాదేవి అన్నారు. లడ్డూ ప్రసాదం నాణ్యతాలోపం, దుర్వాసనపై వచ్చిన ఆరోపణలపై ఆమె స్పందించారు. కొంత మంది ఉదయం నుంచి అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించారని, లడ్డూ ప్రసాదం దుర్వాసన వస్తోందని మీడియాకు ఫోన్ చేశారని తెలిసిందన్నారు. ఆలయ విస్తరణలో భాగంగా ప్రసాదాల తయారీ విభాగం వేరేచోట ఏర్పాటు చేశామన్నారు. లడ్డూలు నాణ్యత లోపించిందని తమ దృష్టికి రావడంతో వెంటనే విచారణ చేపట్టామన్నారు. పాత



కౌంటర్‌లో లడ్డులను పరిశీలిస్తున్న బీజేపీ నేతలు

ఆంధ్రబ్యాంకులో నిల్వ ఉన్న లడ్డూల పాత ట్రేలను ప్రసాదాల కౌంటర్ వద్ద ఏర్పాటు చేశామని, అట్టి ట్రేలు వాడకుండా నిల్వ ఉండటంతో దుర్వాసన వస్తున్నాయన్నారు. లడ్డూ ప్రసాదం దుర్వాసన రావడంపై అనుమానాలు ఉన్నాయని, విచారణ చేస్తున్నామన్నారు. వెంటనే ఫుడ్‌సేఫ్టీ అధికారులకు విచారణ నిమిత్తం శాంపిల్ పంపించామని ఉన్నతాధికారులకు తెలియజేశామని వివరించారు.

లడ్డూ ఘటనపై దేవాదాయ శాఖ మంత్రి ఆరా..

వేములవాడ కల్చరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న ఆల యంలో లడ్డూ ప్రసాదం నాణ్యత లోపం, దుర్వాసన వస్తుందన్న ఘటనపై దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ఆరా తీసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఘటనకు సంబంధించిన సమగ్ర విషయాలు అందజేయాలని టెంపుల్ అధికారులను ఆదేశించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను, ఫుడ్‌సేఫ్టీ అధికారులకు లేఖ సిఫారసు చేసి విషయాలను, ఎక్కడ ఎటువంటి లోపం జరగలేదని, అయినా భక్తుల మనో భావాలను గౌరవించే ప్రక్రియలో భాగంగా కీలక చర్యలు తీసుకుంటున్నట్లు ఈవో మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఎటువంటి తప్పిదాలు జరగొద్దని, జాగ్రత్తగా ఉండాలని, ఆలయ ప్రతిష్టకు సంబం ధించిన వ్యవహారాల్లో తప్పుడు ప్రచారం చేసేవారిపై చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశాలు ఇచ్చినట్లు ఈవో పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లాస్థాయి సెపక్ తక్రా పోటీలు ప్రారంభం

మానకొండూర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి):మండలంలోని చెంజర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉమ్మడి కరీంనగర్‌జిల్లాస్థాయి సెపక్‌తక్రా పోటీలు ప్రారంభం అయ్యాయి. ఉమ్మడికరీంనగర్ సెపక్‌తక్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా సబ్‌జూనియర్, సబ్‌జూనియర్ బాలబాలికలకు పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 11,12వ తేదీల్లో ఆసిఫాబాద్ జిల్లా గోలేటి టౌన్‌షిప్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అసోసియేషన్ కార్యదర్శి విజయ బాస్కర్‌రెడ్డి, జాయింట్ సెక్రెటరీ కరుణాకర్‌రెడ్డి, జస్పీర్‌సింగ్, రాజేశ్ టీ షర్టులు పంపిణీ చేశారు.

ఎస్సారెస్పీకి 75,394 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

జగిత్యాల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌కు వరద నీరు రావడం శుక్రవారం స్వల్పంగా పెరిగింది. 21 గేట్లు పైకి ఎత్తి 65,604 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 75,394 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.053 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

నిలకడగా ఎల్‌ఎండీ నీటి మట్టం

తిమ్మాపూర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): దిగువ మానేరు జలాశయంలో నీటిమట్టం నిలకడగా కొనసాగుతోంది. కాకతీయ కాలువ ద్వారా 2వేలు, మిషన్ భగీరథ, నీటి ఆవిరి రూపంలో 277క్యూసెక్కుల నీరు అవుట్‌ఫ్లో వెలుతోంది. మోయ తుమ్మెదవాగు నుంచి 1077క్యూసెక్కులు, మిడ్ మానేరు నుంచి 1500క్యూసెక్కులు, ఎగువ కాకతీయ కాలువ నుంచి 198క్యూసెక్కులు మొత్తం 2775క్యూసెక్కుల నీరు ఎల్‌ఎండీలోకి ఇన్‌ఫ్లో వస్తోంది. ఎల్‌ఎండీ పూర్తి స్థాయి నీటి మట్టం 24.034టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.818టీఎంసీల నీరు నిల్వ ఉంది.

కలగానే మినీ స్టేడియం

నత్తనడకన కొనసాగుతున్న నిర్మాణ పనులు

విద్యార్థులు, క్రీడాకారులకు తప్పని ఇబ్బందులు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ విద్యార్థులు, యువతీయువకులు క్రీడల్లో రాణించాలనే లక్ష్యంతో మంజూరు చేసిన మినీ స్టేడియం నిర్మాణ పనులు నత్తనడక కొనసాగుతున్నాయి. రెండేళ్ల క్రితం ఎల్లారెడ్డిపేట మండలం కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆధునిక వసతులతో మినీస్టేడియం అందుబాటులోకి రానుందని ఆశించిన విద్యార్థులు, క్రీడాకారులకు కలగానే మిగిలిపోతోంది. సాధన చేయడానికి అనువైన మైదానాలు, ఆట స్థలాలు, సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మినీస్టేడియం మంజూరై రెండేళ్లు గడుస్తున్నా- వినియోగంలోకి రాకపోవడం వల్ల క్రీడాకారులు, విద్యార్థులు అసౌకర్యాల నడుమ సాధన చేయాల్సి వస్తోంది. అరకొర వసతుల మధ్య శిక్షణ పొందిన విద్యార్థులు రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రతిభ కనబరుస్తున్నారు. మినీ స్టేడియం అందుబాటులోకి వస్తే తాము మరింత నైపుణ్యంతో అంత ర్జాతీయ క్రీడల్లో రాణిస్తామని పేర్కొంటున్నారు.

రెండేళ్లుగా కొనసాగుతున్న పనులు..

మండలంలోని విద్యార్థులు, క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు మండల కేంద్రంలో మినీ స్టేడియం నిర్మాణానికి రెండేళ్ల క్రితం అప్పటి రాజ్యసభ సభ్యుడు సంతోష్‌రావు రూ.కోటి నిధులను కేటాయించారు. పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ నిర్మాణాన్ని చేపట్టారు. మినీ స్టేడియంలో గ్యాలరీ, ఫ్లడ్ లైట్లు, ప్రహరీ గోడ, ఆర్చీ నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. సుమారు రూ.43 లక్షలు ఖర్చు చేశారు. సకాలంలో బిల్లులు మంజూరుకాకపోవడం వల్ల పనులను నిలిపివేశారు. యేడాదిగా పనులు నిలిచిపోయాయి. ఇటీవల బిల్లు చెల్లించడంతో తిరిగి పనులను ప్రారంభించారు. గ్యాలరీ, ఆర్చీ నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి.

స్థల వివాదం.. నిలిచిన ప్రహరీ..

మినీ స్టేడియం నిర్మాణ పనుల్లో భాగంగా ప్రహరీ పనులను చేపట్టేందుకు కాంట్రాక్టర్ సిద్ధంగా ఉన్నారు. ప్రహరీ స్థల వివాదం నెలకొనడం వల్ల పనులు ముందుకు సాగడం లేవు. ఇటీవల బదిలీపై వెళ్లిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పనులను పరిశీలించి స్థల వివాదాన్ని పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించినా ప్రయోజనం లేకుండా పోయింది.

ఆటలకు ఇబ్బందులే..

మండలంలో మొత్తం 26 గ్రామపంచాయతీలు ఉన్నాయి. వివిధ పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులతో పాటు క్రీడాకారులు సుమారు 5వేల మంది ఉన్నారు. క్రీడాకారుల్లో ప్రతిభ ఉన్నా.. సాధన చేయడానికి సరైన సదుపాయాలు, మైదానాలు అం దుబాటులో లేవు. అటవీ, పోలీసు, ఆర్మీ ఉద్యోగా లు సాధించాలనుకునే నిరుద్యోగ యువత సాధన చేయడానికి ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం తో పాటు వెంకటాపూర్, రాచర్లబొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి, బండలింగంపల్లి, నారాయణపూర్, రాగట్లపల్లి, పదిర, హరిదాస్‌నగర్, రాచర్లతిమ్మాపూర్, రాచర్లగుండారం, అల్మాస్‌పూర్, తదితర గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లోని మైదానాల్లో సాధన చేస్తున్నారు. పలువురు ఖాళీగా ఉన్న వ్యవసాయ భూములు, ఇళ్ల ఎదుట సాధన చేస్తూ లక్ష్యం వైపు ముందుకు సాగుతున్నారు. మండల స్థాయి క్రీడాపోటీలను మండల కేంద్రంలోని గిద్దె చెరువు సమీపంలో ఉన్న పల్లెప్రకృతి వనంలో అరకొర సౌకర్యాల నడుమ నిర్వహిస్తున్నారు. ప్రతిభ ఉన్నా.. సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మినీ స్టేడియం పనులను పూర్తి చేసేలా చర్యలు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని విద్యార్థులు, క్రీడాకారులు కోరుతున్నారు.



ఓ పాఠశాల ఖాళీ స్థలంలో సాధన చేస్తున్న క్రీడాకారులు

కొనసాగుతున్న మినీ స్టేడియం నిర్మాణ పనులు

మైదానం లేక ఆడలేకపోతున్నాం..

: నాగరాజు, విద్యార్థి, ఎల్లారెడ్డిపేట



ఆటలు ఆడాలన్న ఉత్సాహం ఉన్నా మైదానం లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నాం. ఖాళీ స్థలాల్లో ఆడుకుకోవాల్సి వస్తోంది. మినీ స్టేడియం పనులను పూర్తిచేసి వినియోగంలోకి తీసుకు వస్తే క్రీడల్లో సత్తా చాటుతాం.

ఆటలకు దూరంగా ఉంటున్నాం: రేవతి, విద్యార్థిని, ఎల్లారెడ్డిపేట



మినీ స్టేడియం నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. పనులను పూర్తిచేసి సదుపాయాలను కల్పించాలి. ఆటలు ఆడేం దుకు స్థలం లేకపోవడంతో దూరంగా ఉంటున్నాం. చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ ఉన్నా సౌకర్యాలు లేక రాణించలేకపోతున్నాం. అధికారులు పట్టించుకుని పనులను వేగవంతం చేసేలా చర్యలు చేపట్టాలి.

భూ సేకరణ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

కరీంనగర్ కలెక్టర్ పమేలాసత్పతి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలాసత్పతి

కరీంనగర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్ జిల్లా మీదుగా వెళ్తున్న జాతీయ రహదారి 563 నిర్మాణం కోసం భూసేకరణకు తలెత్తిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ పమేలాసత్పతి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో జాతీయ రహదారి సంస్థ, వరంగల్ ప్రాజెక్టు సంచాలకుడు భరద్వాజ్, రెవెన్యూ డివిజనల్ అధికారులు మహేశ్వర్, రమేశ్‌బాబుతో కలెక్టర్ పమేలా సత్పతి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ భరద్వాజ్ పలు విషయాలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వాటిని త్వరితగతిన పరిష్కరించి, జాతీయ రహదారి సంస్థకు సహకరించాలని సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ, నేషనల్ హైవే అథార్టీ అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఫిజీషియన్ల రాష్ట్ర సదస్సు

సుభాష్‌నగర్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఫిజీషియన్ల సదస్సును కరీంనగర్‌లోని వీ కన్వెన్షన్‌లో శని,ఆదివారాల్లో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఇండియా జిల్లా బాధ్యులు డాక్టర్ విజయ్ మోహన్‌రెడ్డి, డాక్టర్ తిరుపతిరావు, డాక్టర్ రఘురామన్ తెలిపారు. శుక్రవా రం నగరంలోని ఐఎంఏ హాలులో రాష్ట్ర సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. రెండు రోజులపాటు నిర్వహించే ఈ రాష్ట్ర సదస్సులో వైద్య రంగంలో వస్తున్న అధునాతన వైద్య విధానం, చికిత్స, పరికరాలు, మందుల పై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ నిబంధనల ప్రకారం ప్రతీ వైద్యుడు నూతన వైద్య విధానాన్ని నేర్చుకోవాలన్నారు. అందుకు ఇలాంటి సదస్సులు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు పి.చైతన్యరెడ్డి, సంజయ్, జె.సురేష్, వెంకటేశ్వర్లు, వెంకట్‌రెడ్డి, వడ్డెబోయిన లక్ష్మణ్, నవీన, పద్మ, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న వైద్యులు

వేములవాడ రాజన్నకు భక్తుల నీరాజనాలు



వేములవాడ ఆలయ ఆవరణలో భక్తులు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజ రాజేశ్వర స్వామివారికి భక్తులు నీరాజనాలు పలికారు. శుక్రవారం ఉదయం ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించిన భక్తులు పార్వతీపరమేశ్వరులను దర్శించుకున్నారు. కోడెమొక్కులు చెల్లించుకున్నారు. ఈవో రమాదేవి ఆధ్వర్యంలో ఉద్యోగులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. వేములవాడ రాజ రాజేశ్వర స్వామివారి ఆలయ అన్నదాన ట్రస్టుకు హైదరాబాద్ సోమాజి గూడకు చెందిన నీలగిరి శంకరరావు కుటుంబ సభ్యులు రూ. లక్షా 11వేల 111 చెక్కును ఆలయ ఏఈవో శ్రావణ్‌కుమార్‌కు అంద జేశారు.

నేడు భీమేశ్వర ఆలయంలో పూజలు

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయ అభివృద్ధిలో భాగంగా జరిగే మార్పుల దృష్ట్యా భీమేశ్వర ఆలయంలో చేపట్టే దర్శనాలకు పూజలు శనివారం ప్రారంభించనున్నట్లు ఈవో రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. రాజన్న ఆలయ ప్రధానార్చకులు, ఇన్‌చార్జి స్థానాచార్యులు ఉమేష్ శర్మ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9 గంటలకు శ్రీభీమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా భీమేశ్వర ఆలయంలో స్వామి వారి కైంకర్యములు ప్రారంభించు ప్రదేశములకు సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించారు.

భీమేశ్వర ఆలయానికి ఉత్సవమూర్తుల తరలింపు..

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయం నుంచి అర్చక పరివారంతో శనివారం ఉదయం 8.30 గంటలకు పల్లకీసేవలో ఉత్సవమూర్తులను శ్రీభీమేశ్వర ఆలయానికి తరలించనున్నట్లు ఈవో తెలిపారు. అనంతరం పూజాకార్యక్రమాలు చేపటన్ననున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

● జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్ ● ఉమ్మడి జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు స్పందన





కార్యక్రమంలో మాట్లాడుతున్న డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, మల్యాల మండలం తాటిపల్లి గురుకుల పాఠశాల విద్యార్థినులు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): క్రీడలతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం నగరంలోని అంబేద్కర్ స్టేడియంలో మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఉమ్మడి జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీవైఎస్‌వో మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. అల్ఫోర్స్ డిగ్రీ, పీజీ కళాశాల కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులకు తమ సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. ఉమ్మడి జిల్లాలోని పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల నుంచి దాదాపు 200 మంది క్రీడాకారులు ప్రతిభచాటారు. అనంతరం బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల కరస్పాండెంట్ గోవింద కృష్ణ, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరీ వేణుకుమార్, మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీ నిర్వాహకుడు గుంటపల్లి స్వామి, ప్రధాన కార్యదర్శి బాబు, కోచ్‌లు మధుకర్, నామ రమేష్, వెంకటేష్, ముస్తాక్, గంగరాజు, శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్లు రాజశేఖర్, శ్రీనివాస్, రాజు నాయక్, నారాయణ పాల్గొన్నారు.



బ్యాడ్మింటన్ పోటీల విజేతలు

● **విజేతలు వీరే...**

బాలికల విభాగంలో ఎన్.ఇరాన్యశ్రీ, వినూతన, సిరిచందన, అక్షితరెడ్డి, బాలుర విభాగంలో ఎస్.హర్షవర్ధన్, డి.శ్రీచరణ్ విజేతలుగా నిలిచారు. కె.వైభవ్, శ్రీమర్ష, మహ్మద్ రాయల్, శౌర్యతేజ కన్సోలేషన్ బహుమతులు గెలుచుకున్నారు.

కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలకు ఎంపిక

మల్యాల: మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మానస ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-17 విభాగం కబడ్డీలో మనిషా, ఖోఖోలో రేవతి, సంజన, వాలీబాల్‌లో దర్శిని, అక్షయ, అక్షిత, అండర్-14 విభాగం కబడ్డీలో యశశ్విని, హారిక, ఖోఖోలో సంజన జిల్లా స్థాయిలో ప్రతిభ చాటి ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని పేర్కొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో రైతుల ధర్నా

మెట్‌పల్లిటౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రైతు ఐక్య వేదిక ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలో రైతులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి ర్యాలీగా వచ్చి పాత బస్టాండ్ వద్ద రైతుల ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు సన్న బియ్యానికి బోనస్ విడుదల చేయాలని, మొక్కజొన్న కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర 2,420 రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అకాల వర్షం వల్ల పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. దీంతో జాతీయ రహదారిపై కాసేపు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ధర్నా విరమించాలని మెట్‌పల్లి సీఐ అనిల్, ఎస్‌ఐ కిరణ్ కుమార్‌లు రైతులను నచ్చ



ఎంపీడీవో కార్యాలయం ఎదుట రైతుల నిరసన

మాట్లాడుతూ మొక్కజొన్న పంట చేతికి వచ్చి నెలలు గడుస్తున్నా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారులు ధరలు తగ్గించి 1,600 రూపాయలకే కొనుగోలు చేస్తూ రైతులను నట్టేటా ముంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రబీ సీజన్‌లో జెప్పినా వినలేదు. మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్ ఘటన స్థలానికి చేరుకొని సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో డివిజన్‌కు చెందిన రైతులు, రైతు ఐక్య వేదిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీవో కార్యాలయం ఎదుట రైతుల నిరసన

పందుల నుంచి పంటలు కాపాడండి

గంగాధర, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పం టలను ధ్వంసం చేస్తున్న పందుల నుంచి కాపాడాలని తహసీల్దార్, ఎంపీడీవో కార్యాల యాల ఎదుట గంగాధర రైతు లు నిరసన చేపట్టారు. గంగాధర గ్రామపరిధిలో పదుల సంఖ్యలో పందులు గుంపులుగా పంటలపై పడి నాశనం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాత్రి, పగలు తేడాలేకుండా వరి, కూరగాయలు, ఇతర పంటలను పాడు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గుంపులుగా వస్తున్న పందులు ఒంటరిగా ఉన్న రైతులపై దాడులు చేస్తున్నాయని ఆరోపించారు. అధికారులు కలుగజేసుకుని పందుల నుంచి పంటలను కాపాడాలని రైతులు కోరారు.

వైభవంగా సంకష్టహర చతుర్థి పూజలు

ధర్మపురి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సంకష్టహర చతుర్థి సందర్భంగా ధర్మపురి క్షేత్రంలోని గణపతి ఆలయంలో శుక్రవారం అభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పూజలు, హారతి, మంత్రపుష్ప కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేసి స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ వేదపండితులు పాలెపు ప్రవీణ్ కుమార్‌శర్మ, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ద్యావళ్ల కిరణ్, శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు పాల్గొన్నారు.

మారుమూల గ్రామాలకు ప్రయాణ కష్టాలు

- అధ్వానంగా రోడ్లు.. - పట్టించుకోని అధికారులు - ఇబ్బందుల్లో ప్రజలు

చందుర్తి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల గ్రామాలకు ప్రయాణ కష్టాలు తప్పడం లేదు. మండల కేంద్రానికి దూరంగా ఉండడంతో వాటిని పట్టించుకునే వారే కరువయ్యారు. దీంతో ఆయా గ్రామాలకు వెళ్లేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లు అధ్వానంగా ఉండడంతో వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని బండపల్లి గ్రామానికి గతంలో నియోజకవర్గ కేంద్రమైన వేములవాడ నుంచి హన్మాజీపేట, ఎనగల్, బండపల్లి మీదుగా బావుసాయిపేట వరకు రోడ్డు మార్గం ఉంది. అయితే హన్మాజీపేట నుంచి బండపల్లి, బావుసాయిపేటకు సింగిల్ రోడ్డు ఉంది. ఈ రోడ్డు 25ఏళ్ల క్రితం వేసింది. ఇప్పటివరకు డబుల్ రోడ్డుకు నోచుకోలేదు. అంతకుముందు ఇదే మార్గంలో నిజామాబాద్ జిల్లా సిరికొండకు బస్సులు వెళ్లేవి. అయితే కొందరు రోడ్డు మార్గాన్ని మామిడిపల్లి నుంచి అలైన్‌మెంట్ మార్చేయడంతో బండపల్లి రోడ్డు అభివృద్ధిని పట్టించుకునే వారే కరువయ్యారు. ఇరువైపులా చెట్లు పెరగడంతో పాటు రోడ్డంతా గుంతలుగా మారింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు నెలకొన్నాయి. తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఒక వాహనం వస్తే మరో వాహనం వెళ్లే పరిస్థితి లేదు. ఎనగల్ గ్రామం వద్ద నక్కవాగు పొంగి ప్రవహిస్తే కల్వర్టుపై నుంచి నీరు వెళ్లి రాకపోకలు ఆగిపోతాయి. ఇటీవల వరదలకు నక్కవాగు కల్వర్టు తెగిపోయి బస్సులు రద్దయ్యాయి. మళ్లీ తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఈ కల్వర్టు ఎత్తు పెంచి నిర్మించాల్సిన అవసరం ఉంది. ఎనగల్ బైపాస్ రోడ్డు గుంతలమయమైంది. రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో వాహనాలు వెళ్లే పరిస్థితి లేకుండా పోతోంది. మరోవైపు బండపల్లి నుంచి బావుసాయి ఎట మధ్యలో కల్వర్టు చిన్నగా ఉండటంతో వరదనీరు ఎక్కువ వస్తే రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఈ కల్వర్టు ఎత్తు పెంచి కొత్తగా నిర్మించాలని పలువురు కోరుతున్నారు.



ఎనగల్-బండపల్లి రోడ్డు

మండల కేంద్రానికి వెళ్లడం గగనమే..

చందుర్తి మండల కేంద్రానికి వెళ్లాలంటే బండపల్లి, ఎనగల్ గ్రామాల ప్రజల కష్టాలు చెప్పనలవి కాదు. రోడ్డు సక్రమంగా లేక బస్సులు నడవవు. ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మండలానికి వెళ్లాలంటే వేములవాడ వరకు వెళ్లి చందుర్తికి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. చందుర్తికి వెళ్లడానికి ప్రజలు అష్టకష్టాలు పడాల్సిందే.

గుంతలమయంగా కిష్టంపేట రోడ్డు..

బండపల్లి నుంచి కిష్టంపేట గ్రామానికి వెళ్లాలంటే కష్టంగా ఉంది. చెరువు కట్టపై నిర్మించిన రోడ్డు వర్షాలు పడితే బురదమయంగా మారుతోంది. రోడ్డంతా గుంతలు ఏర్పడి ప్రయాణానికి వీలులేకుండా పోతోంది. ద్విచక్ర వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. కార్లు అసలే వెళ్లవు. ఈ రహదారి బాగుంటే మండల కేంద్రానికి వెళ్లడం సులభంగా ఉంటుంది. ఇప్పటికైనా బండపల్లి రోడ్డు అభివృద్ధి కోసం అధికారులు, నాయకులు కృషి చేయాల్సిన అవసరం ఉంది.

డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలి..

- అంబాల శ్రీకాంత్, బండపల్లి



వేములవాడ నుంచి బండపల్లి వెళ్లే రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చాలి. సింగిల్ రోడ్డుతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వర్షాకాలంలో ఇరువైపులా చెట్లు పెరగడంతో రోడ్డు మూసుకుపోయి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి.

బైపాస్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

- కుటుంబ జనార్దన్, ఎనగల్



ఎనగల్ నుండి బండపల్లి వెళ్లే బైపాస్ రోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారింది. ఈ రోడ్డుపై వెళ్లాలంటేనే వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ రోడ్డు మరమ్మతు చేపట్టేందుకు నిధులు మంజూరు చేయాలి.

గుంతలమయంగా మామిడిపల్లి రోడ్డు

- తరచూ చోటుచేసుకుంటున్న ప్రమాదాలు

- మరమ్మతులు చేయాలని ప్రజల విజ్ఞప్తి



మామిడిపల్లి-హన్మాజీపేట గ్రామాల మధ్య ఏర్పడిన గుంత

కోనరావుపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : మామిడిపల్లి వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డును బాగు చేయాలని మండలవాసులు కోరుతున్నారు. వేములవాడ మండలం హన్మాజీపేట నుంచి మామిడిపల్లి మీదుగా బావుసాయిపేట వట్టిమల్ల వరకు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. హన్మాజీపేట-మామిడిపల్లి గ్రామాలమధ్య తారురోడ్డు పలుచోట్ల గుంతలు ఏర్పడడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల ఓ యువకుడు గుంతలో బైకు అదుపుతప్పి మృతిచెందాడు. మామిడిపల్లి -బావుసాయిపేట గ్రామాల మధ్య కూడా ప్రధానరహదారి గుంతలుగా ఏర్పడడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రధాన రహదారిలో ఏర్పడిన గుంతలను మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

రామలక్ష్మణపల్లెలో ఉచిత వైద్య శిబిరం

ముస్తాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామలక్ష్మణపల్లెలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో రామలక్ష్మణపల్లెలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో దాదాపు 200 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి షుగర్, బీపీ, ఈసీజీ, పరీక్షలను ఉచితంగా చేశారు. ఈసందర్భంగా మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ గ్రామీణ పేద ప్రజలకు సూపర్ స్పెషాలిటీ సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో ఉచిత మెగా వైద్య శిబిరాలను గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెలవులతో సంబంధం లేకుండా 24 గంటల వైద్య సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో జనరల్ ఫిజిషియన్ డాక్టర్ సురేశ్, మాజీ సర్పంచ్ దమ్మ రవీందర్‌రెడ్డి, మెడికవర్ మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, లక్ష్మీరాజం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి రాణినర్సింలు



పోతుగల్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ రాణినర్సింలు, బాల్‌రెడ్డి తదితరులు

ముస్తాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : వరిధాన్యపు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ముస్తాబాద్ మండల మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి రాణినర్సింలు పేర్కొన్నారు. మండలంలోని పోతుగల్, గూడెం, గూడూరు గ్రామాల్లో వరిధాన్యపు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి అనంతరం చైర్మన్ తలారి రాణినర్సింలు మాట్లాడుతూ దళారుల బారినపడి రైతులు మోసపోవద్దన్నారు. పండించిన పంటగింజ చివరి వరకు కొనుగోలు చేస్తామని రైతులు సహకరించాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన కొనుగోల్ల కేంద్రాల్లో ధాన్యాన్ని అమ్మి గిట్టుబాటు ధరను పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు గజ్జెల రాజు, గుండెల్లి శ్రీనివాస్, అనమేని రాజు, రాంరెడ్డి, గాంత రాజు, అంజనేయులు, ప్రతాపరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ యూత్ అసోసియేషన్ నూతన కమిటీ

గంభీరావుపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) :గంభీరావుపేట శ్రీ రామ ట్రాక్టర్ యూత్ అసోసియేషన్ నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గంట శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా గొల్లపల్లి తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా మారవేని మహేష్, కోశాధికారిగా చల్లపురం గణేష్, సలహాదారులుగా గంద్యాడపు లింగం, పెద్దవేని రాజమల్లయ్య, చిలుక స్వామి, గంట రమేష్, కోటయ్యగారి సంతోష్‌రెడ్డి తదితరులు ఎన్నుకున్నారు.

చేనేత కార్మికుల జీవన విధానంపై అవగాహన సదస్సు

వేములవాడ టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని చేనేత వస్త్ర పరిశ్రమ కేంద్రాల్లో చేనేత కార్మికుల జీవన విధానంలో మార్పులు, మానసిక స్థితిగతులపై రాజన్న లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ కొలిపాక నర్సయ్య ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. లయన్స్ ఇంటర్నేషనల్ ఆదేశానుసారం 320జీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. సదస్సుకు హాజరైన సిరిసిల్ల చేనేత కార్మిక సైకాలజిస్ట్ ఈశ్వర్ పురుషోత్తం మాట్లాడుతూ చాలా మంది కార్మికులు రెక్కాడితే కాని డొక్కాడని పరిస్థితులు ఉన్నాయని, చాలా మంది చేనేత కార్మికులు మానసికంగా కృంగిపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్న తరుణంలో సదస్సులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సంతోష్, ప్రవీణ్, రాజు, తదితరులు ఉన్నారు.

ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

చందుర్తి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలో ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి వినయ్ కుమార్ అన్నారు. సనుగుల ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న ఆధార్ నమోదు కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. విద్యార్థుల ఆధార్ నమోదు పరిశీలించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సనుగుల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, కటుకూరి ముఖేష్, సీఆర్‌పీ ఉమ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడిపై విద్యార్థులకు అవగాహన

కోనరావుపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మానసిక ఒత్తిడిపై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మానసిక వైద్యనిపుణుడు డాక్టర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ పరీక్షల సమయంలో విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనుకాకుండా పలు సూచనలు ఇచ్చారు. మానసిక ఒత్తిడి అధిగమించేందుకు విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి వేణుమాధవ్, ప్రిన్సిపాల్ శంకర్‌రెడ్డి, ఏఎన్ఎం సరిత తదితరులు ఉన్నారు.

గంజాయి పట్టివేత.. ముగ్గురి అరెస్ట్

ఇల్లంతకుంట, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతలకుంటపల్లె గ్రామసమీపంలో గంజాయిని పట్టుకున్నట్లు ఎస్సై లక్పతి తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం గంజాయిని అమ్మటానికి వస్తున్నారనే సమాచారం మేరకు శుక్రవారం వాహనాలు తనిఖీ చేస్తుండంగా అనంతగిరి గ్రామానికి చెందిన రెడ్డి రాకేష్‌రెడ్డి, ఉప్పల ప్రణీత్‌రెడ్డి, మాసం మనీష్‌కుమార్‌లు అనుమానాస్పందగా కనిపించారు. వారి వద్ద తనఖీ చేయగా 103 గ్రాముల గంజాయిని పట్టుకున్నట్లు తెలిపారు. నిందితులను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు.

అయ్యప్ప స్వాములకు అన్నప్రసాదం

ముస్తాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : శబరిమల పాదయాత్ర చేస్తున్న అయ్యప్ప స్వాములకు డాక్టర్ అరుణ, డాక్టర్ చందర్ దంపతులు శుక్రవారం అన్నప్రాసాదాన్ని అందించారు. ముస్తాబాద్ అయ్యప్ప ఆలయం నుంచి దాదాపు 52 రోజులు పాదయాత్ర చేసి స్వాములు శబరిమల చేరుకోనున్నారు.

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

తంగళ్లపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలుచేయాలని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు గజభీంకర్ రాజన్న డిమాండ్ చేశారు. శుకవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తూ కాంగ్రెస్‌పార్టీ చోటామోటా నాయకులు అధికారం చెలాయిస్తున్నారని విమర్శించారు. రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందనిఅన్నారు. సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు మాట్ల మధు మాట్లడుతూ సారంపల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకుడు అంగన్‌వాడీ సెంటర్‌లోకి చొరబడి రికార్డులను ధ్వంసం చేయడం సిగ్గుచేటన్నారు. ప్రశ్నిస్తే పోలీసులతో కేసులు పెట్టిస్తూ ఇబ్బందులకు గురి చేస్తుండడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. కేకే మహేందర్‌రెడ్డి కనుసన్నల్లో కాంగ్రెస్ నాయకులు అనేక అవినీతి కార్యక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ప్యాక్స్ చైర్మన్ బండి దేవదాస్, మాజీ ఎంపీపీ పడిగెల మానస రాజు, బీఆర్ఎస్ నాయకులు జక్కుల నాగరాజులు మాట్లడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలుచేయాలని బాకీ కార్డుతో ప్రశ్నిస్తే ఆ పార్టీ నాయకుల్లో భయం మొదలయ్యిందన్నారు. బీసీ రిజర్వేషన్ల అమలు చేస్తామని నాటకం ఆడి కోర్టుల్లో కేసులు వేయిస్తూ ద్వందకవ వైఖరి అవలంబిస్తున్న కాంగ్రెస్ కుట్రలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో నాయకులు పడిగెల రాజు, సత్యనారాయణరెడ్డి, బండి జగన్, కస్తూరి తిరుపతిరెడ్డి, అడగట్ల భాస్కర్, భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులవి అసత్య ఆరోపణలు..

- యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మునిగెల రాజు

తంగళ్లపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నాయకులు అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మునిగెల రాజు హెచ్చరించారు. శుక్రవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సారంపల్లి గ్రామానికి చెందిన నాయకులు, అంగన్‌వాడీ ఆయా కుమారుడితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులకు గ్రామంలో ఒటమి తప్పదని అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు మాయం అయ్యాయని నాటకానికి తేర లేపారని విమర్శించారు. రికార్డులు సారంపల్లి కాంగ్రెస్ నాయకులు మాయం చేశారని అసత్య ఆరోపణలు చేస్తున్నారని కుట్రకు తెరలేపారని అన్నారు. స్థానిక మాజీ ఎంపీటీసీ భర్త అంగన్‌వాడీ ఆయాతో మాట్లాడించడం వీడియాలో వినిపిస్తుందన్నారు. ఆయా మానసిక పరిస్థితి బాగాలేదని అన్నారు. ఆయా కొడుకు శ్రీనివాస్‌పై వత్తిడి తేర్చారన్నారు. ఈ సంఘటనపై పోలీసులు సమగ్రంగా విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అంగన్‌వాడీ ఆయా కొడుకు శ్రీనివాస్ మాట్లడుతూ అంగన్‌వాడీ ఆయాకు మానసిక పరిస్థితి బాగలేదని అన్నారు. గ్రామంలో అందరికీ ఈ విషయం తెలుసు అని అన్నారు. ఆమెతో మాట్లాడించి బురద పూసే ప్రయత్నం చేయడాన్ని తప్పు పట్టారు.

బీసీల 42 శాతం రిజర్వేషన్ల సాధనకు ఉద్యమిస్తాం



నిరసన తెలుపుతున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీల 42 శాతం రిజర్వేషన్ల సాధన కొరకు ఉద్యమిస్తాం అని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శహన్మాండ్లు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో జీవో నెంబరు 9పై హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులపై కండ్లకు గంతలు కట్టుకొని బీసీ సంక్షేమ సంఘం నాయకులు నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా పర్శహన్మాండ్లు మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లను అడ్డగిస్తే సహించమని దీనిపై బీఆర్ఎస్, బీజేపీ పార్టీల వైఖరి పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. బీసీల 42 శాతం రిజర్వేషన్లు సాధించేంతవరకు నిరవధిక తెలంగాణ బంద్‌కు వెనకాడమన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేం సంఘం పట్టణ అధ్యక్షుడు తడక కమలాకర్, జిల్లా అధికార ప్రతినిధి బండారు బాల్‌రెడ్డి, కిషన్, వెంకటరమణ, తోట రాములు, కార్తిక్, శ్రీనివాస్, మల్లేష్‌యాదవ్, అంజనేయులు, రాజకుమార్, తిరుపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాల మహానాడు ఆధ్వర్యంలో నిరసన

గంభీరావుపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో శుక్రవారం మాల మహానాడు నాయకులు, కార్యకర్తలు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. హైకోర్టు న్యాయమూర్తి సీజేఐ బీఆర్ గవాయిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ మాజీ మంత్రి దివంగత పాటి రాజం విగ్రహం వద్ద నిరసనకు దిగారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చట్టాలను రూపొందించాలన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం, నాయకులు రఘు, బాలయ్య, సుదర్శన్, రాజు, శంకర్, వెంకటేష్, శ్యాంసుందర్, చక్రధర్, సతీష్, చరన్, బాను, ఉదయ్, బాల్‌నర్సు, సాత్విక్, హర్షవర్దన్, నిహాల్ తదితరులు ఉన్నారు.

మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

వేములవాడ టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మున్సిపల్ యూనియన్, సీఐటీయూ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 14,15వ తేదిల్లో రంగారెడ్డి జిల్లాలో నిర్వహించే రాష్ట్ర మహాసభల పోస్టర్లను శుక్రవారం పట్టణ మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గుర్రం అశోక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ మున్సిపల్ కార్మికులందరూ పాల్గొని మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సరిపల్లి నరేష్, దుబ్బ లచ్చయ్య, లక్ష్మీ, మల్లేశం, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రానికి స్థలం కేటాయించాలి



వినతిపత్రం అందజేస్తున్న రైతు సంక్షేమ సంఘం నాయకులు

చందుర్తి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రానికి స్థలం కేటాయించాలని చందుర్తి రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు చిలుక పెంటయ్య అన్నారు. మండల కేంద్రంలో రైతులు పండించిన ధాన్యం ఆరబెట్టుకొనడానికి స్థలం కేటాయించడంతో పాటు ఐకేపీ సింగిల్‌విండో ఆధ్వర్యంలో రెండు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేయాలని తహసీల్దార్‌కు మండల రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రం శివారులో దాదాపు 400 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. అట్టి భూమి నుంచి 20ఎకరాల స్థలం ధాన్యం కొనుగోలు కేంద్రానికి కేటాయించాలన్నారు. ఇప్పటికే పలుమార్లు స్థలం కేటాయించాలని నిరసన కార్యక్రమాలు చేపట్టామన్నారు. ధాన్యం ఆరబెట్టడానికి స్థలం లేక రోడ్లపై ఆరబోస్తే, ధాన్యం రాసులను వాహనదారులు రాత్రి వేళలో ఢీకొని ముగ్గురు రైతులు మృతిచెందగా, పలువురు గాయాలపాలయ్యారన్నారు. అనంతరం తహసీల్దార్ స్పందించి స్థల పరిశీలన చేసి కేటాయిస్తామన్నారు. చందుర్తిలో ఐకేపీ, సింగిల్ విండో ఆధ్వర్యంలో వేర్వేరుగా రెండు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంక్షేమ సంఘం నాయకులు భూంపల్లి రామారావు, నల్మాసు రవిందరరెడ్డి, బత్తుల శ్రీనివాస్, లక్కర్సు రాజేశం, మర్రి లక్ష్మయ్య, రాములు లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీసీలను మభ్యపెట్టేందుకు కాంగ్రెస్ ప్రయత్నం

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నామని గొప్పలు చెప్పి జీవో 9 పేరిట మభ్యపెట్టేందుకు కాంగ్రెస్ ప్రయత్నించిందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ అందె సుభాష్ ఆరోపించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ కామారెడ్డి బహిరంగ సభలో కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ ప్రకటించిందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజ్యాంగ విరుద్ధమైన జీవోతో కాలం వెళ్లదీస్తేందుకు ముందుకు వెళితే న్యాయస్థానం చెప్పపెట్టులా స్టే విధించిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసగించిందని ఆరోపించారు. ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను ప్రజలు గమనిస్తున్నారని రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని సుభాష్ అన్నారు. సెస్ డైరెక్టర్ కృష్ణహరి, నాయకులు రమేశ్, భీమేశ్వర్, మురళీమోహన్, సందీప్, పర్శరాములు, రాజం, సీత్యానాయక్, నర్సింలు, శ్రీనివాస్, సురేశ్, జబ్బార్, బాలరాజు నర్సాగౌడ్, దేవరాజు, అజిమొద్దిన్,అనసూయ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయ అన్నదాన ట్రస్టుకు రూ. 3 లక్షల విరాళం

వేములవాడ కల్చరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయ అన్నదాన ట్రస్టుకు సిరిసిల్లకు చెందిన జోగినిపెల్లి స్రవంతి-వెంకటకిరణ్‌లు రూ.3లక్షల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయానికి వచ్చిన దాతలు ముందుగా రాజన్న దర్శనం చేసుకుని ఈవో కార్యలయంలో ఈవో రమాదేవికి చెక్కును అందజేశారు.

ధాన్యం కొనుగోళ్లు షురూ..

(5వ పేజీ తరువాయి)

231 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఇందులో ఐకేపీ ద్వారా 144కేంద్రాలు, సింగిల్ విండోల ద్వారా 79 కేంద్రాలు, డీసీఎంఎస్ ద్వారా ఒకటి, మెప్మా ద్వారా 7 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ధాన్యం కొనుగోళ్లలో ఉపయోగించడానికి గన్నీ బ్యాగులు, 7592 టార్పాలిన్‌లు, 764 ప్యాడీ క్లీనర్లు, 603 మాయిశ్చరైజ్ మీటర్లు, 270 వేయింగ్ మిషన్లు సిద్ధం చేశారు. దీనికి అనుగుణంగానే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్లు జరిగే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

2.35 లక్షల ఎకరాల్లో వివిధ పంటల సాగు

వానాకాలం సీజన్‌కు సంబంధించి రాజన్న సిరిసిల్ల జిల్లాలో 235330 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. వరి184310 ఎకరాలు, మొక్క జొన్న 3748 ఎకరాలు, పత్తి 46485 ఎకరాలు, కందులు 660 ఎకరాలు, పెసర 30 ఎకరాలు, ఇతర పంటలు 137ఎకరాల్లో సాగు చేశారు. జిల్లాలో 2.35లక్షల ఎకరాల్లో సాగుకు సంబంధించి మండలాల్లో గంభీరావుపేట మండలంలో 18598 ఎకరాల్లో సాగు కాగా ఇల్లంతకుంటలో 36970 ఎకరాలు, ముస్తాబాద్‌లో 23835 ఎకరాలు, సిరిసిల్ల 5623 ఎకరాలు, తంగళ్లపల్లి 21086 ఎకరాలు, వీర్నపల్లి 8300 ఎకరాలు, ఎల్లారెడ్డిపేట 21100 ఎకరాలు, బోయినపల్లి 19167 ఎకరాలు, చందుర్తి 21367 ఎకరాలు, కోనరావుపేటలో 23140 ఎకరాలు, రుద్రంగి 10964, వేములవాడ 10038 ఎకరాలు, వేములవాడ రూరల్ 15142 ఎకరాల్లో సాగు చేశారు. జిల్లాలో ప్రధాన పంటలుగా వరి, పత్తి సాగు వైపే మొగ్గు చూపారు. జిల్లాలో వరి సాగులో గంభీరావుపేటలో 18500ఎకరాల్లో నాట్లు వేసుకోగా ఇల్లంతకుంటలో 24000ఎకరాలు, ముస్తాబాద్‌లో 23000ఎకరాలు, సిరిసిల్లలో 4800ఎకరాలు, తంగళ్లపల్లిలో 20100ఎకరాలు, వీర్నపల్లిలో 8000ఎకరాలు, ఎల్లారెడ్డిపేటలో 17500ఎకరాలు, బోయినపల్లిలో 12600ఎకరాలు, చందుర్తిలో 15100ఎకరాలు, కోనరావుపేట 18300ఎకరాలు, రుద్రంగిలో 5910 ఎకరాలు, వేములవాడలో 5200 ఎకరాలు, వేములవాడ రూరల్‌లో 11300 ఎకరాల్లో వరి సాగు జరిగింది.. పత్తి సాగు జిల్లాలో 46385 ఎకరాల్లో విత్తనాలు వేసుకున్నారు. ఇందులో గంభీరావుపేటలో 85ఎకరాలు, ఇల్లంతకుంటలో 12000ఎకరాలు, ముస్తాబాద్‌లో 530 ఎకరాలు, సిరిసిల్లలో 800 ఎకరాలు, తంగళ్లపల్లిలో 870 ఎకరాలు, వీర్నపల్లిలో 300ఎకరాలు, ఎల్లారెడ్డిపేటలో 3600 ఎకరాలు, బోయినపల్లిలో 6400 ఎకరాలు, చందుర్తిలో 6200ఎకరాలు, కోనరావుపేట 4800 ఎకరాలు, రుద్రంగిలో 2200 ఎకరాలు, వేములవాడలో 4800 ఎకరాలు, వేములవాడ రూరల్‌లో 3800 ఎకరాల్లో వరి సాగు చేశారు.

బీసీ రిజర్వేషన్ల అమలుకు పోరాటం

- బీసీ సంఘం జాతీయ కార్యదర్శి సురేశ్‌గౌడ్

ముస్తాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల అమలుకు పోరాటం చేయాలని బీసీ యువజన సంఘం జాతీయ కార్యదర్శి ఈడ్గురాళ్ల సురేశ్ గౌడ్ పేర్కొన్నారు. ముస్తాబాద్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సురేశ్ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడంతో బీసీలకు తీరని అన్యాయం జరిగిందని సంఘం అధినేత ఆర్ కృష్ణయ్య పిలుపు మేరకు ఈనెల 14వతేదీన తలపెట్టిన బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బీసీ నాయకుల సమావేశం ఈనెల 12న ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు చిగురు వెంకన్న, పాకాల శ్రీకాంత్, అధికార ప్రతినిధి మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్‌ను అడ్డుకుంటున్న బీఆర్ఎస్, బీజేపీ

రుద్రంగి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలుకాకుండా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలే అడ్డుకున్నాయని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు గండి నారాయణ అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో కాంగ్రెస్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేసిందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం సహకరించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేదికాదన్నారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఇప్పటికైనా బీసీల ఆవేదనను అర్థం చేసుకోవాలన్నారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ చెలుకల తిరుపతి, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, తర్రె మనోహర్, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, పల్లి గంగాధర్, పూదరి మహిపాల్, చెలుకల శ్రీనివాస్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ ప్రీమియర్ లీగ్



విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

కోనరావుపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం వెంకట్రావుపేట గ్రామంలో కేఎంసీ ఆధ్వర్యంలో క్రికెట్ ప్రీమియర్ లీగ్ క్రీడలు 15 రోజులు కొనసాగాయి. శుక్రవారం గెలుపొందిన ఆరెంజ్ వారియర్స్ టీంకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జీఎం గ్రూప్స్ ప్రొఫైటర్స్ సీఈవో సింగం ప్రసాద్, ప్రజాప్రతినిధులు కెంద గంగాధర్, మిరియాల బాలాజీ, మంత్రి సంతోష్, ఎడ్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.